# రక్షకభటులే.. భక్షకులై....

# మహిళకు కుచ్చుటోపి

- వ్యాపారం పేరుతో అధిక లాభాలని నమ్మబలికి 1.80 కోట్లు స్వాహా
- ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు

2 లో...





జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 25 | ఫిబ్రవరి | 2026 ◆ పేజీలు : 6

## ఇంటర్ పరీక్షల సందడి... 18,685 విద్యార్థులు, 37 కేంద్రాలు

- నేటి నుంచి ప్రారంభమైన వార్షిక పబ్లిక్ పరీక్షలు
- ప్రశ్నాపత్రాల భద్రతకు ప్రత్యేక చర్యలు
- ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు సిద్ధం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఫిబ్రవరి 24, ప్రజాజ్యోతి :** జిల్లాలో నేటి నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈసారి మొత్తం 18,685 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, అందుకు జిల్లావ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడతాయి. ఇప్పటికే ఈ పరీక్షలు సజావుగా జరిగేలా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రశ్నాపత్రాల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి స్ట్రాంగ్ రూమ్ ల వద్ద 24 గంటల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీటీవీ పర్యవేక్షణతో పాటు ప్రశ్నాపత్రాల రవాణా, భద్రపరిచే ప్రక్రియలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

మిగతా 2 లో...



## అసలేం జరిగింది..? అలా ఎందుకు చేశారు..?

6 లో..

- అవగాహన కార్యక్రమం మధ్య ఘటన..
- డివైడర్ దాటి పరిగెత్తిన కానిస్టేబుల్..
- కారు ఢీ తర్వాత ఉద్రిక్త పరిస్థితి..
- పోలీసుల వ్యవహారంపై ప్రశ్నలు..?

**సోమవారం మధ్యాహ్నం సుజాతనగర్ వేపలగడ్డ జియో పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన ఒక ఘటన ఇప్పుడు స్థానికంగా పెద్ద చర్చకు దారి తీసింది. చిన్న ప్రమాదంగా మొదలైన ఈ సంఘటన, తర్వాత జరిగిన పరిణామాల వల్ల వివాదంగా మారింది. దీంతో అసలు అక్కడ ఏం జరిగింది? పోలీసులు ఎందుకు అలా ప్రవర్తించారు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- ► రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు
- ► ఇంటర్, పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశంలో కీలక ఆదేశాలు
- ► ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి
- ► జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**పాల్వంచ ఫిబ్రవరి 24 ప్రజా జ్యోతి:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఇంటర్ మీడియట్ , పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో మంగళవారం రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగిత రానా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య హైదరాబాద్ నుండి పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్

మిగతా 2 లో...

## సీఎం కప్ విజయాలు జిల్లాకు గర్వకారణం

- ♦ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**పాల్వంచ: ఫిబ్రవరి 24: ప్రజా జ్యోతి** రాష్ట్ర యువజన సర్వీసులు , క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడాకారులు సాధించిన విజయాలు జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు . రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ పోటీలలో జిల్లా నుండి పాల్గొన్న క్రీడాకారులు వివిధ క్రీడా విభాగాలలో ప్రతిభ కనబరచి మొత్తం 54 పతకాలు సాధించడం విశేషమని అన్నారు . ఈ సందర్భంగా మంగళవారం ఐడీఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పతక విజేతలను అభినందించి, వారి కృషిని ప్రశంసించారు. క్రీడాకారులు సాధించిన 15 బంగారు, 19 వెండి, 20 కాంస్య పతకాలు జిల్లాకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని అన్నారు, ముఖ్యంగా అథ్లెటిక్స్ విభాగంలోనే 31 పతకాలు సాధించడం జిల్లాలో క్రీడా అభివృద్ధి దిశగా సానుకూల పరిణామమని అన్నారు, గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన యువ క్రీడాకారులు కూడా సమానంగా ప్రతిభ చాటుకోవడం

మిగతా 2 లో...

## సీఎం కప్ విజయాలు జిల్లాకు గర్వకారణం



(మొదటి పేజీ తరువాయి...)

అభినందనీయమని, క్రీడల ద్వారా యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావన పెంపొందుతాయని కలెక్టర్ అన్నారు . క్రీడలు విద్యతో పాటు సమాన ప్రాధాన్యత పొందాలని, పాఠశాల స్థాయిలోనే ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు, క్రీడాకారుల విజయాలలో కోచ్ లు, శిక్షకులు, పాఠశాలల ప్రిన్సిపాళ్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారుల సహకారం ప్రశంసనీయమని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో జాతీయ , అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా జిల్లా క్రీడాకారులు రాణించేలా అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన , క్రీడల అధికారి యం. పరంధామ రెడ్డి, ఎస్ జీఎఫ్ సెక్రటరీ నరేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనురాధ, అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మహిధర్, కొమరారం వెంకటనారాయణ (ఏఎస్ఓ, ట్రైబల్ వెల్ఫేర్), బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ మట్టపర్తి రమేష్, టైక్వాండో సెక్రటరీ రమేష్, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, మంజిలాల్ (పీడీ), నాగలక్ష్మి (పీడీ), చైతన్య (పీడీ), వాసు, నాగేందర్, నాగరాజు, మాలికార్జున్, గిరిప్రసాద్, కావేటి రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షల సందడి... 18,685 విద్యార్థులు, 37 కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి...)

అమలు చేస్తున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు చురుకుగా పర్యవేక్షణ చేపడతాయి. ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, అవసరమైన ఫర్నిచర్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకుండా పటిష్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నారు. విధుల్లో పాల్గొనే సిబ్బంది తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలనే ఆదేశాలు జారీ అయ్యాయి. విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని పరీక్షలు రాయాలని జిల్లా అధికారులు సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

## టిప్పర్లే వారికి జీవనాధారం...

- ఫైనాన్స్ చెల్లించలేక ఇబ్బందులు
- ఈఎంఐ లు కట్టలేక నానా అవస్థలు





**టేకులపల్లి,ఫిబ్రవరి 24,ప్రజాజ్యోతి :** పొట్ట చేత పట్టుకొని జీవనోపాధి కోసం ఫైనాన్స్లో టిప్పర్లు కొనుక్కొని కేఓసీలో బొగ్గు లోడింగ్ పై ఆధారపడి బతుకుతున్న సుమారు 170కి పైగా టిప్పర్ల యజమానుల కుటుంబాలను ఒకరి కోసం బలి చేయడం సరైనది కాదని టేకులపల్లి టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి మండలం చుక్కాలబోడు క్రాస్ రోడ్ వద్ద గల యూనియన్ ఆఫీసు వద్ద యజమానులు నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 14,12 టైర్ల టిప్పర్ల యజమానులు బిపిఎల్ నవభారతులకు బొగ్గు రవాణా చేస్తున్నారు వీరంతా స్థానికులే కాకుండా కోయగూడెం ఓసి లో భూములు కోల్పోయిన భూనిర్వాసితులు కేఓసి నుంచి బిపిఎల్, నవభారత్ తదితర ప్రాంతాలకు బొగ్గు రవాణా అవుతుంది. దీంతో భూ నిర్వాసితులైన స్థానికులు ఫైనాన్స్ పై టిప్పర్ లు కొనుగోలు చేసి కేవోసి నుంచి బొగ్గు లోడింగ్ చేసుకొని రవాణా చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం బిపిఎల్,నవభారతలకు 16 టైర్ల టిప్పర్లు ద్వారా బొగురవాణా చేయడం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రాబోవు రోజుల్లో తమకు లోడింగ్ దొరకదని తద్వారా ఈ ఎం ఐ లు కట్టలేక ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం అంతా రోడ్డున పడాల్సి వస్తుందని యజమానులు వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి బిపిఎల్ నవభారతులకు 16 టైర్ల టిప్పర్లను అనుమతించొద్దని విజ్ఞప్తి చేశారు.

# రక్షకభటులే భక్షకులై మహిళకు కుచ్చుటోపి

- వ్యాపారం పేరుతో అధిక లాభాలని నమ్మబలికి 1.80 కోట్లు స్వాహా
- ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు

**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 24 (ప్రజా జ్యోతి):** గతంలో ఎస్సైలుగా పనిచేసి ప్రస్తుతం సస్పెండ్ గా ఉన్నటువంటి ఇద్దరు పోలీస్ అధికారులు వ్యాపార నిమిత్తం ఓ మహిళ వద్ద డబ్బు తీసుకుని కమీషన్ ఇస్తామని నమ్మబలకి అసలు కూడా ఎగ్గోట్టినందుకుగానూ సహకరించిన వారి తండ్రితో కలిపి ముగ్గురిపై బూర్గంపహాడ్ పోలీసులు సోమవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. బూర్గంపహాడ్ మండలం సారపాకకు చెందిన భూక్యా కుమారి అనే మహిళ నుంచి 2023 జూన్ నెలలో భద్రాచలం ప్రాంతంలో ఎస్సైలుగా పని చేసిన ఖమ్మం ప్రాంతానికి చెందిన మహేష్, రాణాప్రతాప్ లతో పాటు తండ్రి చంద్రం రూ.1.82 కోట్లు వ్యాపారం కోసం తీసుకున్నారు. వ్యాపారం నిమిత్తం కమీషన్ 35శాతం ఇస్తామని నమ్మబలికి ఆమె వద్ద తీసుకున్న నగదు ఇవ్వకుండా మోసం చేశారని బాధిత మహిళ సోమవారం బూర్గంపహాడ్ పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎస్సై నాగభిక్షం ఆ ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా జిల్లాలో భద్రాచలం, చుంచుపల్లి, జూలూరుపాడు తదితర పోలీసుస్టేషన్ లలో వీరు ఎస్సైలుగా పనిచేసి ప్రస్తుతం సస్పెన్షన్ లో ఉన్నారు. ఒక కేసు విషయంలో వీరు శిక్ష అనుభవించారని పోలీసు వర్గాల ద్వారా విశ్వసనీయంగా తెలిసింది.




### బెదిరింపులకు పాల్పడుతూ వాట్సాప్ లో చాటింగ్..

కేసు నమోదు అయిన అనంతరం నిదితుల వద్ద నుండి బాధ్యత మహిళకు వాట్సప్ రూపంలో తాము ఉద్యోగానికి రిజైన్ చేస్తామంటూ అలా జరిగితే నీ డబ్బులు ఎలా వస్తాయో చూస్తానంటూ మెసేజ్లు చేస్తూ, నాపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తావా అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. కాగా సమాజాన్ని తీర్చిదిద్దే బాధ్యతా యుతమైన వృత్తిలో ఉండి ఇటువంటి పని చేయడంపై పోలీస్ వ్యవస్థకే తీరని మచ్చగా మిగిలిపోతుందని నెటిజన్లు, ప్రజాసంఘాలు చర్చించుకుంటున్నారు.

## పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి...)

జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇంటర్ ,పదో తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రశ్నాపత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద 24 గంటల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీటీవీ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను చురుకుగా పనిచేయించేలా చర్యలు తీసుకోవాలని, చీఫ్ సూపరింటెండెంట్లు తమ బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. పదవ తరగతి పరీక్ష కేంద్రాల బయట విద్యార్థులు, సిబ్బంది సౌకర్యార్థం క్లాస్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బి సెక్షన్ ను అమలు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన కిట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, అవసరమైన ఫర్నిచర్ వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఉండేలా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఈ పరీక్షలను అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో రేపటి నుండి నిర్వహించనున్న ఇంటర్ మీడియట్ వార్షిక పబ్లిక్ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఫిబ్రవరి 25, నుండి మార్చి 18, వరకు ప్రతిరోజు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ప్రథమ , ద్వితీయ సంవత్సర పరీక్షలు నిర్వహించబడతాయన్నారు . జిల్లాలో మొత్తం 18,685 మంది విద్యార్థులు హాజరుకానుండగా, 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు, సీసీటీవీ పర్యవేక్షణ, ప్రశ్నాపత్రాల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల రవాణా ,భద్రపరిచే ప్రక్రియలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు కల్పించినట్లు తెలిపారు . మార్చి 14, నుండి ఏప్రిల్ 16, వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అవసరమైన సదుపాయాల కల్పన కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సాధారణ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడనున్నాయని చెప్పారు. జిల్లాలో 12,731 మంది రెగ్యులర్ విద్యార్థులు, 404 మంది ప్రైవేట్ అభ్యర్థులు నమోదు కాగా, మొత్తం 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణలో ప్రశ్నాపత్రాల భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ఏర్పాటు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయం, తాగునీరు , ఇతర మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై సమగ్ర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విధుల్లో పాల్గొనే అధికారులు తప్పనిసరిగా తమ ఐడీ కార్డులు ధరించి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు . సిబ్బందికి అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో కి ఫోన్ లు మరే ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు తీసుకువెళ్లకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సమన్వయంతో, విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన, జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, జిల్లా ఇంటర్మీడేట్ అధికారి వెంకటేశ్వర్లు ,వైద్య శాఖ అధికారి తుకారాం రాతోడ్, డి పి ఓ సుధీర్, కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ సుజాత,రవాణా శాఖ అధికారి,టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సులోచనరాణి ,ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వర్లు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందు సీఐని కలిసిన కౌన్సిలర్

**ఇల్లందు, ఫిబ్రవరి 24, ప్రజాజ్యోతి:** ఇల్లందు సీఐ తాటి పాముల సురేష్ను మంగళవారం పోలీస్ స్టేషన్ లో 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తి అయ్యేందుకు పోలీస్ శాఖ ఎంతో కృషి చేసిందని 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు యువకులు వెంకటేట్ , మేకల నాగేష్, శేఖర్, రాకేష్ పాసి, ఓం ప్రకాష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# చైర్ పర్సన్, వైస్ చైర్మన్ లను సన్మానించిన వాటర్ సెక్షన్ కార్మికులు





**ఇల్లందు, ఫిబ్రవరి 24, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపాలిటీ నూతన చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్ దంపతులు, వైస్ చైర్మన్ పెండేల రాజు, శ్రీ హరివాసం రియల్ ఎస్టేట్ చైర్మన్ పెండెల హరికృష్ణలను మంగళవారం ఇల్లందు మున్సిపాలిటీ వాటర్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్, వైస్ చైర్మన్ లు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధిలో వాటర్ సెక్షన్ కార్మికుల పాత్ర అత్యంత కీలకమన్నారు. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా నిరంతరం, నాణ్యతతో అందించడం ఒక పెద్ద బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు తన విధిని నిబద్ధతతో నిర్వర్తిస్తూ మున్సిపాలిటీకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయానికి నీటి సరఫరా అందించాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు. కార్మికులకు ప్రభుత్వం, మున్సిపాలిటీ ద్వారా అందే అన్ని రకాల ప్రయోజనాలు (బెనిఫిట్స్) సమయానికి అందేలా పాలకవర్గం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. కార్మికుల సంక్షేమమే తమ లక్ష్యమని, వారి సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం మేయర్ ను కలిసిన సింగరేణి అధికారి హీర్య



**కొత్తగూడెం, ఫిబ్రవరి 24, ప్రజాజ్యోతి :** కొత్తగూడెం కార్పొరేషన్‌కు నూతనంగా ఎన్నికైన మేయర్ మూడ్ గణేష్‌ను సింగరేణి ఎస్టేట్ విభాగానికి చెందిన అధికారి హీర్య మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో సింగరేణి అధికారి మేయర్‌కు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కొంతసేపు పరస్పరం మాట్లాడుకున్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారుడికి ఆర్థిక సహాయం



**ఇల్లందు, ఫిబ్రవరి 24, ప్రజాజ్యోతి:** ఇల్లందు నియోజకవర్గం బయ్యారం మండలంలోని ఉప్పలపాడు శివారు గొల్లగుడెం గ్రామానికి చెందిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు బయ్యా నవీన్ యాదవ్ కు శ్రీ హరివాసం రియల్ ఎస్టేట్ చైర్మన్ పెండెల హరికృష్ణ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా అందచేశారు. ఇటీవల ఇండోనేషియాలో జరిగిన అంతర్జాతీయ బాల్ బాడ్మింటన్ పోటీల్లో ఇండియా జట్టు నుండి నవీన్ ఆడి గోల్డ్ మెడల్ సాధించిన నవీన్ ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, నాయకులు మధుకర్ రెడ్డి, గందే సదానందం, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఎరువులు వాడితే భూసారానికి ముప్పు తప్పదు

- ఏవో శంకర్



**బూర్గంపహాడ్, ఫిబ్రవరి 24 (ప్రజా జ్యోతి):** రసాయన ఎరువులు అధికంగా వాడితే భూసారానికి ముప్పు తప్పదని మండల వ్యవసాయాధికారి శంకర్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రైతులకు అధిక ఎరువుల వాడకంలో కలిగే నష్టాల పై పలు సూచనలు చేశారు. భూసారం తగ్గకుండా అన్నదాతలకు ఆయన పలు సూచనలు చేశారు. నేల జీవవైవిధ్యాన్ని పరిరక్షించి పంటలకు మేలు చేసే సూక్ష్మ జీవులను పెంపొందించేలా పశువుల ఎరువు, కంపోస్టు తదితర సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలన్నారు. నేల భౌతిక, రసాయన, జీవ సంబంధిత లక్షణాలను మెరుగుపరిచేలా జనుము, జీలుగ, పెసర, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట పైర్లను పెంచి నేలలో కలియదున్నాలని, గాలిలో నత్రజనిని స్థిరీకరించి భూసారం పెంచి మొక్కలకు పోషకాలు అందుబాటులోకి తెచ్చే అజటోబాక్టర్, అజోస్పైరిల్లం తదితర ఎరువులు వాడాలన్నారు. నేలలో పోషకాలు, సేంద్రియ కర్బన శాతం మేలు రకమైన సూక్ష్మజీవుల సంఖ్యను పెంచే పంటల అవశేషాలను కాల్చేయకుండా నేలలోనే కలియదున్నాలని సూచించారు. నిరంతరం ఒకే తరహా పంటలు పండించకుండా ప్రత్యామ్నాయ పంటలు మార్పిడి చేస్తే నేలసారం కాపాడుకోవడమే కాకుండా చీడపీడల తీవ్రతను తగ్గించుకోవచ్చని ఏవో రైతులకు సూచించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పేదలకు వరం : ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**పినపాక, ఫిబ్రవరి 24(ప్రజాజ్యోతి):** సీఎంఆర్ఎఫ్ చెక్కులు పేద కుటుంబాలకు నిజమైన ఆర్థిక భరోసా అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పినపాక మండలం భూపాలపట్నం గ్రామంలో ఆరుగురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం పేదలకు విద్య, వైద్య రంగాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆర్థికంగా బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ స్వప్న, ఉప సర్పంచ్ శిరీష, సెక్రటరీ చంద్రకుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## టీజీపియస్సీ వెబ్‌సైట్‌లో 'ఓటీఆర్' నమోదుకు గడువు పెంపు

- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ పాషా



**పాల్వంచ: ఫిబ్రవరి 24 :ప్రజా జ్యోతి:** టీజీపియస్సీ వెబ్‌సైట్‌లో ఓటీఆర్ అప్‌డేట్ చేసుకోవడానికి గడువు తేదీ మార్చి 25 వరకు పొడిగించడం జరిగిందని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటీఆర్ లో నమోదు చేసిన వివరాలనే దరఖాస్తు ఫారమ్‌లో పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు, కావున ఇంకా తమ ఓటీఆర్ నమోదు చేయని అభ్యర్థులు వెంటనే డేటాను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఈడబ్ల్యూఎస్, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికేట్, ప్రస్తుత విద్యార్హత పత్రాలు, తాజా ఫోటో, మొబైల్ నంబర్, ఈమెయిల్ ఐడీ వంటి వివరాలనుసదరు వెబ్‌సైట్‌లో మార్చి 25లోపు జాగ్రత్తగా నమోదు చేసి అప్‌లోడ్ చేయాలని కోరారు. లేకపోతే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని నిరుద్యోగులు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. ఇతర సమాచారం కోసం 8520860785 కు సంప్రదించాలని సూచించారు.

## పెద్ద వెంకటాపురంలో భూ సర్వే

- సరిహద్దు వివాదాల పరిష్కారమే లక్ష్యం



**ఆళ్ళపల్లి. ఫిబ్రవరి24. ప్రజా జ్యోతి:** ఆళ్ళపల్లి మండలంలోని పెద్ద వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం భూ సర్వే కార్యక్రమం నిర్వహించారు. భూ వివాదాలను పరిష్కరించి, భూముల సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించడమే లక్ష్యంగా ఈ సర్వే సాగింది. సర్వేలో పాల్గొన్న అధికారులు గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ తగాదాలను ఈ సర్వే ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ వజ్జ ఉమా రెవెన్యూ ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం





**పినపాక, ఫిబ్రవరి 24(ప్రజాజ్యోతి):** పినపాక మండలం ఏడుల్ల బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌరిటేక్ హైదరాబాద్ సంస్థ సహకారంతో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో బయ్యారం కాంప్లెక్స్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దంత పరీక్షలు మరియు సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ప్రతి విద్యార్థిని పరిశీలించి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ వాగబోయిన చంద్రరావు, ఉప సర్పంచ్ గంగిరెడ్డి సందీప్ రెడ్డి, మౌరిటేక్ ప్రతినిధులు ప్రశాంత్ రెడ్డి, డాక్టర్ సింధు, డాక్టర్ శిరీష, ఈవెంట్ మేనేజర్ వాసు బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమరం నాగయ్య, ఇంచార్జ్ హెచ్ఎం తిరుపతి రెడ్డి, పిడి వీరన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గిరిజనుల పోడు సమస్యను వెంటనే పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో కి వినతి పత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే గుమ్మడి



**టేకులపల్లి,ఫిబ్రవరి 24, ప్రజాజ్యోతి:** గిరిజనుల పోడు సమస్యను వెంటనే పరిష్కరించాలి భద్రాచలం ఐ టి డి పి ఓ రాహుల్ ను మర్యాదపూర్వకంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ టేకులపల్లి మండలం సిద్ధారం గ్రామంలో గత కొన్ని దశాబ్దాలుగా పోడు భూమి సాగుచేసుకుని జీవనం కొనసాగిస్తున్న గిరిజనులకు ప్రభుత్వం కొంతమందికి మాత్రమే పట్టాలు ఇచ్చి మరి కొంత మందికి పట్టాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా వారు ఎంతో కాలం నుండి పంటలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్న గిరిజనులను ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా ఈ సంవత్సరం పత్తి పంటను తీయనియకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి పంటలు పండిస్తే ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాల కారణంగా గిరిజన రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సత్వరమే ఐటీడీఏ పీవో జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కరించి రైతులకు పంటలు తీసుకునే అవకాశం కల్పించాలని ఆ తరువాత సమగ్ర సర్వే జరిపి గిరిజన రైతులకు అటవీ హక్కుల పట్టాలు ఇవ్వాలని కోరారు. గ్రామంలో గిరిజన రైతుల మధ్య కొంత మందికి పట్టాలు ఇచ్చి కొంతమందికి ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేయటం కారణంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని గిరిజనుల మధ్య వైశ్యామ్యాలు పెరిగే అవకాశం ఉందని గుమ్మడి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే ఈ సమస్యను పరిష్కరించకపోతే గిరిజనులను కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. టేకులపల్లి మండలంలో కొండంగల బోడు గ్రామంలో అటవీ హక్కుల పట్టా కలిగిన గిరిజన రైతు జర్పుల సుందర్ తన పొలంలో వ్యవసాయ నిమిత్తం తుప్పలు తొలగించి వ్యవసాయానికి సిద్ధం చేస్తున్న అతనిపై స్థానిక ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా అక్రమ కేసు బనాయించి ఇబ్బందులకు గురి చేశారని ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు ఈ దౌర్జన్యాలకు పాల్పడితే గిరిజనుల వైపు నుండి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జాటోత్ కృష్ణ, డివిజన్ నాయకులు ఆజాద్, సుందర్,గిరిజన రైతులు కం గాల నాగేశ్వరరావు, కొరస మల్లయ్య, దొడ్డ అంజయ్య, కొమరం దినేష్, పాయం వెంకటేశ్వర్లు, మలకం ఆదినారాయణ, జోగా శ్రీను, కొరస శ్రీ కాంత్,పాయం లక్ష్మీ నారాయణ, జ ర్పుల సుందర్,సిపిఐ ఎంఎల్ మాస్ లై న్ కొత్తగూడెం జిల్లా కమిటీ సభ్యులు యళ్లపల్లి ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వాలి

- బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు డిమాండ్



**చర్ల, ఫిబ్రవరి 24: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వక పోవటవలన ఆత్మ హత్యలు గుండె పోటు తో రిటైర్డ్ ఉద్యోగుల మరణమృదంగం మోగుతుంది అని వారి పెన్షన్ బెనిఫిట్స్ వెంటనే ఇచ్చి చావులు ఆపాలని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకు ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత 6 గ్యారంటీలు అమలు చేయకపోయినా ప్రజలు జీవించగలరు కాని ప్రభుత్వ ఉద్యోగి 30 సంవత్సరాలు ప్రజా సేవ చేసి జీతాన్ని పొదుపుగా వాడుకొని రిటైర్డ్ అయిన తర్వాత వచ్చే బెనిఫిట్స్ పిల్లలకు ఉపయోగపడతాయాని అప్పులు తీరతాయని ఎంతో ఆశతో ఇన్సూరెన్స్ అని జి పీఎఫ్ అని అనేక రకాలుగా దాచ్చుకున్నవి ప్రభుత్వం ద్వారా రావలసిన బెనిఫిట్స్ అమౌంట్ ఇవ్వకపోవుటవలన చనిపోతున్నారు అని అన్నారు .కర్మకాండలకు కూడ డబ్బులు లేక చందాలు వేసుకోవలసిన పరిస్థితి ఈ ప్రభుత్వాం తీసుకొచ్చింది అని 2004 నుండి ప్రభుత్వం ఉద్యోగుల పెన్షన్ అపివేసింది అని కొంత మంది ఉద్యోగులు పెన్షన్ లేక బెనిఫిట్స్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని ప్రజా పాలన అంటే రాష్ట్రంలో ప్రజలు సుఖంగాఉండాలి అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులార కళ్లు తెరవండి ఇప్పుడు మీకు జీతాలు వస్తున్నాయని రిటైర్డ్ అయిన వారి గురించి పట్టించుకోవడం లేదు రేపు మీకు కూడా ఇదే పరిస్థితి వస్తుంది అని ప్రభుత్వానికి బయపడి బానిసత్వం చేయకండి మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించారు ప్రజాస్వామ్యంలో మనకు ఇష్టమైన వారికి ఓటు వేయవచ్చ అదే విధంగా ప్రభుత్వంతో పని చేయించుకోవాలి కాని ప్రభుత్వం మోసం చేస్తున్నా చూస్తున్నారు అని అన్నారు. ఆరు డిఏ ల గురించి పీ ఆర్ సి గురించి అడిగే సంఘాలు లేవు అని ఒకప్పుడు సంఘాలు ఉద్యోగుల కోసం ప్రభుత్వం పై తిరగబడి న్యాయం చేసేవారు అని ఇప్పుడు ఉద్యోసంఘాలు బలహీన పడ్డాయి అని ఇప్పటికైన రిటైర్డ్ ఉద్యోగుల గురించి ప్రభుత్వంతో చర్చలు జరిపి వారికి రావలసి పెన్షన్ బెనిఫిట్స్ వచ్చేవిధంగా న్యాయం చేయండి అని కోరారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- పెదమిడిసిలేరు బాలికల హాస్టల్ లో వైద్య శిబిరం



**చర్ల, ఫిబ్రవరి 24: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదమిడిసిలేరు బాలికల హాస్టల్ లో డాక్టర్ నగేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు .ఈ వైద్య శిబిరంలో హాస్టళ్లలో ఉన్న విద్యార్థినులందరికి వైద్య పరీక్షలు నిర్వహించారు .ఎవ్వరికీ జ్వరాలు లేకపోవటంతో జలుబు, దగ్గు, దురదలు ఉన్న వారికి మందులు ఇచ్చారు .ఈ సందర్భగా డాక్టర్ నగేష్ మాట్లాడుతూ అందరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ,నీళ్లు నిల్వలేకుండా చూసుకోవలని ఎల్లపుడు పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని గోర్లు చిన్నవిగా ఉంచుకోవాలని ఆహారం తినేముందు మరుగుదొడ్డిని ఉపయోగించిన తరువాత చేతులను శుభ్రం చేసుకోవాలని అన్నారు.ఎల్లప్పుడు శుభ్రమైన దుస్తులను ధరించుకోవాలని చేతులను శుభ్రం చేసుకునే పద్దతులను విద్యార్థులు తెలియచేసారు .ఈ శిబిరం లో 83 మందికి సాధారణ వ్యాధులకు మందులు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నగేష్, బాబురావు హెచ్ ఈ ఓ,దీప్తిమౌనిక ఎమ్ హెల్ హెచ్ పి ,సుబ్బారావు, వేణు హెల్త్ అసిస్టెంట్స్ సామ్రాజ్యం హెచ్.ఎమ్, ఈశ్వర్ పి.డి ,మౌనిక ఏ ఎన్ ఎమ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- టీపీటీఎఫ్ జిల్లాప్రధాన కార్యదర్శి డిమాండ్



**ఆళ్ళపల్లి. ఫిబ్రవరి24. ప్రజాజ్యోతి:** గిరిజన సంక్షేమ విద్యారంగంలోని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్ ) జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం అనంతోగు ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని గిరిజన సంక్షేమ హాస్టళ్లను ఆశ్రమ పాఠశాలలుగా మార్చాలి. భాషా పండితులు, పిఈటి పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలి.సీఆర్టీలు, డైలీ వేజ్ వర్కర్లకు మినిమం టైమ్ స్కేల్ ఇచ్చి వారిని రెగ్యులరైజ్ చేయా లి.జీవో 317 బాధితులకు న్యాయం చేయాలి మరియు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రత్యేక టీఆర్టీ ద్వారా భర్తీ చేయాలి.తమ సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో రెండో దశ పోరాటానికి సిద్ధమయ్యామని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 26 తేదీన ఐటీడీఏ భద్రాచలం కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన. మార్చి 10 తేదీన హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమ కమిషనర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలలో ఉపాధ్యాయులు, సీఆర్టీలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాంబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సిహెచ్. భద్రమ్మ, కృష్ణ, సాంబశివరావు, లక్ష్మి, ఈ. రాంబాబు, సిహెచ్. స్వప్న పాల్గొన్నారు.

## సర్పంచ్ పై వార్డు సభ్యుల ఫిర్యాదు



**టేకులపల్లి,ఫిబ్రవరి24,ప్రజాజ్యోతి:** టేకులపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ బోడ బాలు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని వార్డు సభ్యులు ఆరోపించారు.ఎవరి అనుమతి లేకుండానే ఇష్టానుసారంగా పనులు చేయిస్తున్నారని మంగళవారం ఎంపీడీవో మల్లేశ్వరికి,ఎంపీవో గణేష్ గాంధీకి,రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటున్న సర్పం చ్ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వార్డు మెంబర్లు రామకృష్ణ, కిరణ్, గణేష్,ఉష, కొక్క డిమాండ్ చేశారు.

## నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

- ప్రారంభించిన ఎస్ ఈ మహేందర్





**చర్ల, ఫిబ్రవరి 24: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం చర్ల సబ్ స్టేషన్ లో రూ.2.40 కోట్లతో ఏర్పాటు చేసిన అదనపు పి.టి .ఆర్ (పవర్ ట్రాన్స్ఫర్మర్ ) తో పాటు ఇతర అభివృద్ధి పనులను ఎస్ ఈ మహేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఇ జీవన్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్ ఈ మహేందర్ మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ అంతరాయాలను నిరోధించేందుకు జిల్లాలో అన్ని సబ్ స్టేషన్ ల లో అదనంగా రెండు విద్యుత్ ట్రాన్స్ఫర్మర్లను సిద్ధంగా ఉంచే ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆదివాసీలకు ఉచితంగా విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు "జుగ" ఆధ్వర్యంలో కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని అన్నారు . ఈ పథకం ద్వారా ఆదివాసీల ఇళ్లకు రూపాయి ఖర్చు లేకుండా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేస్తామన్నారు. సీఎం డి ,మేనేజింగ్ డైరెక్టర్ ల సహకారం తో జిల్లాలో వ్యవసాయ, గృహ వినియోదారులకు మరింత నాణ్యంగా విద్యుత్ అందించే కార్యచరణ చేస్తున్నట్లు ఎస్ఈ తెలిపారు. చర్ల మండలం పెదమిడిసిలేరులో రూ.2.50 కోట్లతో కొత్తగా విద్యుత్ ఉపకేంద్రం నిర్మిస్తామన్నారు. చర్లలో నూతనంగా కంట్రోల్ రూమ్ తో పాటు సెక్షన్ ఆఫీస్ కోసం నిధులు మంజూరయ్యాయన్నారు. పి టి ఆర్ ఏర్పాటు లో చక్కటి పనితీరు కనబరిచిన ఏఈ వెంకటేష్, రాజా ను సత్కరించారు.ఈ కార్యక్రమం లో డిఈ వెంకటేశ్వరరావు, ఏడీఈలు ప్రభాకర్, రాంబాబు, ఏ ఈ మోహన్ రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

# కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ ని కలిసిన సుజాత మండల ప్రెస్ క్లబ్ పాత్రికేయులు

- మేయర్ కు పాత్రికేయ అధ్యక్షులు చల్లగుండ్ల నరేష్ శాలువాతో సన్మానం
- సుజాతనగర్ లో సెంటర్ నుండి శివాలయం వరకు సెంటర్ లైటింగ్ తన కోరిక.మేయర్ మూడ్ గణేష్
- నాకు 60 డివిజన్ ల పరిపాలన సమానమే





**సుజాత నగర్ ఫిబ్రవరి 24 ప్రజాజ్యోతి :** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో మొన్న జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి మూడు గణేష్ అందుకున్నారు. మూడు గణేష్ ని మర్యాదపూర్వకంగా వారి చాంబర్లో పాత్రికేయులు ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. సుజాత నగర్ మండలం పాత్రికేయుల అధ్యక్షులు చల్లగుండ నరేష్ కుమార్ శాలువా తో సన్మానించారు.సుజాత మండల ప్రజల సమస్యలు మేయర్ కీ తెలియజేశారు. మూడు గణేష్ మాట్లాడుతూ నాకున్న 60 డివిజన్లు సమానంగా పరిపాలన చేస్తానని అన్ని పనులు చేసుకుంటా వస్తానని ప్రతి ఒక్క డివిజన్ కి సంబంధించిన లైట్లు, వాటర్ సమస్య అన్ని సమానంగా అభివృద్ధి చేస్తానని చెప్పారు.ప్రభుత్వం నుండి రావలసిన పథకాలు ప్రతి ఒక్క ప్రాంతానికి న్యాయం జరిగేలా చేస్తామని వారు అన్నారు ప్రజలు అలాగే నాపై నమ్మకం ఉంచిన సభ్యులు వారి నమ్మకాన్ని వమ్ము కాకుండా పరిపాలన విధానాన్ని కొనసాగిస్తానని అన్నారు. సుజాతనగర్ లో సెంటర్ నుండి శివాలయం వరకు సెంటర్ లైటింగ్ తన కోరిక అది నెరవేర్చే విధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుజాత మండల పాత్రికేయుల అధ్యక్షుడు చల్లగుండ నరేష్ కుమార్, ఉపాధ్యక్షులు చంద్రగిరి అపర్ణ, ట్రెజరీ ఉబ్బన పల్లి ప్రసాద్, బత్తుల రవికాంత్, కత్తి బాలకృష్ణ, అజ్జు పాల్గొన్నారు.

## నూతన మేయర్ మూడ్ గణేష్కు జి.యల్.ఎస్ జేఏసి శుభాకాంక్షలు

- కార్పొరేషన్ కార్యాలయంలో ఘన సన్మానం



**కొత్తగూడెం, ఫిబ్రవరి 24, ప్రజా జ్యోతి :** కొత్తగా ఏర్పడిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్కు ఎన్నికైన తొలి గిరిజన మేయర్ మూడ్ గణేష్ను గిరిజన లంబాడీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జి.యల్.ఎస్ జేఏసి) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జి.యల్.ఎస్ జేఏసి చైర్మన్ ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన మేయర్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ గిరిజన వర్గానికి చెందిన వ్యక్తి కార్పొరేషన్ మేయర్గా ఎన్నిక కావడం గర్వకారణమని తెలిపారు. కొత్తగూడెం కార్పొరేషన్ అభివృద్ధికి సమాజం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. మేయర్ మూడ్ గణేష్కు శుభాకాంక్షలు తెలియజేసి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జి.యల్.ఎస్ జేఏసి ముఖ్య నాయకులు బానోత్ రమేష్ నాయక్ (సెక్రటరీ జనరల్), వైస్ చైర్మన్లు లావుడ్య ప్రసాద్ నాయక్, వాంకుడోత్ హథీరాం, గౌరవ అధ్యక్షుడు బోడ లాలు, అధికార ప్రతినిధులు భట్టు ఝుంకిలాల్, రవి రాథోడ్, లావూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శులు ధరావత్ సురేష్ నాయక్, బర్మవత్ హరి నాయక్, లావుడ్య వెంకటేష్, జాయింట్ సెక్రటరీలు బానోత్ శ్రీనివాస్, గుగులోత్ మోహన్ నాయక్, రాజ్ కుమార్, జర్పుల లచ్చు నాయక్, మీడియా సెక్రటరీలు బానోత్ పూర్ణ, ధరావత్ నాగరాజు, బానోత్ నాగరాజు హాజరయ్యారు. అదేవిధంగా టిజిటిటిఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాలోత్ బిచ్చ నాయక్, భూక్యా బిచ్చ నాయక్, జిల్లా గౌరవ అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రుణావల్ వీరన్న, టిజిటిఎటిఫ్ జిల్లా నాయకులు నూనావత్ రామ్ చందర్, రవి, లోకేష్, వెంకట్, రాంజీ, భద్రు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## రెబల్ కాండిడేట్ తో పాటు మరో ముగ్గురు సస్పెండ్

- సి పి యం పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పనిచేసిన వాళ్ళని సస్పెండ్
- పార్టీ నిర్ణయాలను క్రమశిక్షణను ఉల్లంఘించిన ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు
- సిపిఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్

**సుజాత నగర్ ఫిబ్రవరి 24 ప్రజాజ్యోతి:** మండలం లో ఇటీవల జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నాయకుల గూడెం గ్రామానికి చెందిన పార్టీ సభ్యులు చల్లా ఏడుకొండలు, చల్ల అశోక్, చల్లా నాగేంద్ర, చల్లా నరసింహారావు పార్టీ నిర్ణయాన్ని పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి కార్పొరేషన్ ఎన్నికల్లో చల్లా నాగేంద్ర రెబల్ అభ్యర్థిగా పోటీ చేసి పార్టీ ప్రతిష్టను దిగజార్చే విధంగా వ్యవహరించినందుకు, పార్టీని ఓడించడానికి ప్రయత్నం చేసినందుకు వారిని పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ మండల కమిటీ నిర్ణయం తీసుకుందనీ పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ బి ఫామ్ ఇవ్వలేదని రెబల్ గా పోటీ చేశారు. పార్టీ ఎవరికి బీ ఫామ్ ఇచ్చిన,ఎవరికీ అధికారం వచ్చినా పార్టీ తీసుకున్న నిర్ణయాలను కట్టుబడి పని చేయాలి.పార్టీ నిర్ణయాలను క్రమశిక్షణను ఉల్లంఘించిన ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన అన్నారు. ఇకనుంచి చల్లా ఏడుకొండలు, చల్ల అశోకు, చల్లా నాగేంద్ర, చల్లా నరసింహారావు కు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కొన్ని శక్తులు పార్టీకి వ్యతిరేకంగా పనిచేసినప్పటికీ పార్టీ నిర్ణయానికి కట్టుబడి సిపిఎం అభ్యర్థిని గెలిపించిన పార్టీ శ్రేణులు సానుభూతిపరులు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## కేఓసి పిఓ పై చర్యలు తీసుకోవాలి

- భూ నిర్వాసితులు,స్థానిక కార్మికులు డిమాండ్



**టేకులపల్లి,ఫిబ్రవరి 24,ప్రజాజ్యోతి :** టేకులపల్లి మండల కే ఓసి పరిసర ప్రాంతాల భూ నిర్వాసితులు, నిర్వాసిత గ్రామాల ప్రజల పట్ల కే ఓ సి పి ఓ అనుసరిస్తున్న మెండి వైఖరి తగదని అతనిపై చర్యలు తీసుకోవాలని పిట్ వన్ ప్రభావిత కిష్టారం గ్రామ నిర్వాసితులు స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ను వేడుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను కిష్టారం గ్రామస్తులు కోయగూడెంలో కలిసి సమస్యలను ఆయన దృష్టి తీసుకెళ్లారు.ఎన్నో ఏళ్లుగా టార్పాలిన్ కట్టి జీవనం కొనసాగిస్తున్నామని కానీ గత కొంత కాలంగా ఓబి క్యాంప్ వద్ద టార్పలిన్ కట్ట వద్దంటూ వేధింపులకు గురి చేస్తున్నారని వారు ఎమ్మెల్యేకి మొరపెట్టుకున్నారు. కేఓసీలో బొగ్గు నిల్వలు మండి విషవాయువులు వెలబడుతున్నాయని దాని ఫలితంగా ప్రభావిత గ్రామాల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్న కొద్దో గొప్ప మా నోటి కాడికి కూడిపోతున్న ఒకటే కారణంతో ఇప్పటివరకు ఓపిక పట్టాము కానీ పిఓ అర్థం పడటం లేకుండా వ్యవహరిస్తూ మా పొట్టపై కొడుతున్నాడు అని కార్మికులు ఎమ్మెల్యే దృష్టి తీసుకువెళ్లారు. అంతేకాకుండా నిర్వాసిత గ్రామాల పంట పొలాలకు నీళ్లు ఇవ్వాలని పలుమార్లు కోరినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల మొరను ఆలకించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటున్న వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోయగూడెం సర్పంచ్ కోరం సుభాష్ చంద్ర బోసు, కిష్టారం సర్పంచ్ కోర్స రామకృష్ణ,నిర్వాసితులు పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు చేయాలి

- పిఆర్సి,డిఏ,పెండింగ్ బిల్లులు,రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి



**టేకులపల్లి,ఫిబ్రవరి 24,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలో వివిధ పాఠశాలను సందర్శించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పి ఆర్ టి యు టీజీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుండి మార్చి 8 వతేది వరకు జరుగుతున్న నిరసన వారోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి. వెంకటేశ్వరరావు,బి.రవి ఉపాధ్యాయులని కోరినారు. పి ఆర్ టి యు టీజీ టేకులపల్లి మండల శాఖ నూతన కమిటీని మంగళవారం ముత్యాలంపాడులో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది అధ్యక్షులుఎండి బాబా షఫీద్దీన్,ప్రధాన కార్యదర్శి జి. చిన్నజగ్గు, ఉపాధ్యక్షులు బి.మంగులాల్,కార్యదర్శి ఏ. దస్రు,నూతన బాడీకి జిల్లా శాఖ తరపున అభినందనలు తెలియజేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రసాద్,ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తుల్జాపూర్ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసిన జేఏసీ

**కొత్తగూడెం, ఫిబ్రవరి 24, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శ్రీశ్రీశ్రీ సాతి భవానిల ప్రతిష్ఠాపనకు 21 రోజులు పూర్తయిన సందర్భంగా జిల్లా బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని శ్రీశ్రీశ్రీ తుల్జాపూర్ దేవస్థానాన్ని సోమవారం సందర్శించారు. జేఏసీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ సారథ్యంలో గణేష్ మహారాజ్, సాధు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు తేజావత్ రాములు, జేఏసీ ప్రధాన కార్యదర్శి గుగులోత్ కేశవ్ నాయక్ లతో కూడిన బృందం తుల్జా భవాని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. పూర్ణకుంభాభిషేకం, కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టత, ఆచార విధానాలను తెలుసుకున్నారు. తదుపరి దేవస్థానం మేనేజర్ రామేశ్వర్ వలీని మర్యాదపూర్వకంగా కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జేఏసీ చైర్మన్ డాక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సాతి భవానిలను ప్రతిష్ఠించిన విషయాన్ని వివరించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన మహాజాతరకు విశేష స్పందన లభించిందని తెలిపారు. త్వరలోనే అమ్మవారికి శాశ్వత ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. తుల్జా భవాని అమ్మవారికి అక్కడ ప్రతి రోజూ నిర్వహించే పూజా కైంకర్యాలను భద్రాద్రి జిల్లాలోనూ అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని దేవస్థానం మేనేజర్ హామీ ఇచ్చారు. త్వరలోనే భద్రాద్రి జిల్లాలో ప్రతిష్ఠించిన అమ్మవార్లను దర్శించేందుకు వస్తానని తెలిపారు. ఈ యాత్రతో జేఏసీ సభ్యులు ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని వ్యక్తం చేయగా, బంజారా సమాజంలో సాతి భవాని అమ్మవారి భక్తి మరింత బలపడిందని సభ్యులు పేర్కొన్నారు.



## రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన దివ్యాంగ విద్యార్థి

- భవితా కేంద్రంలో ఘన సన్మానం



**దమ్మపేట,ఫిబ్రవరి. 24,(ప్రజజ్యోతి ):** దమ్మపేట మండలంలోని ఎంపీపీఎస్ కొత్తపేట పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఈరోజు దమ్మపేట సర్పంచ్ శ్రీమతి పగడాల రమాదేవి, ఉప సర్పంచ్ శ్రీ అంగోతు శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి శ్రీమతి కీసర లక్ష్మీ, దమ్మపేట ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఉషారాణి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతి మంగళవారం, శనివారం నిర్వహిస్తున్న శారీరక వ్యాయామ చికిత్స శిబిరాన్ని పరిశీలించారు. రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల కోసం నిర్వహించిన క్రీడా పోటీలలో 50 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ బహుమతి సాధించిన దమ్మపేటకు చెందిన విద్యార్థి తురసం హర్షవర్ధన్‌ను ఘనంగా సన్మానించారు. అతని ప్రతిభను ప్రశంసిస్తూ సర్పంచ్ రమాదేవి, మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీ నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వారానికి రెండుసార్లు నిర్వహిస్తున్న శారీరక వ్యాయామ చికిత్స సేవలను అవసరమైన విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. నాగలక్ష్మి, ఎస్. కనకదుర్గ, శారీరక వ్యాయామ చికిత్స నిపుణురాలు కె. తిరుమల కుమారి, ఎంపీపీ ఎస్ కొత్తపేట ప్రధానోపాధ్యాయులు ఎస్.కే. మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## నా భర్తపై అక్రమ కేసులు పెట్టారు...

- పంచాయతీలో ఇబ్బందులకు గురి చేస్తున్నారు...




**టేకులపల్లి,ఫిబ్రవరి24,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని చంద్రుతండా గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఇండిపెండెంట్ గా గెలిచానని, అభివృద్ధి చేద్దామనుకుంటే అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నారని ఆమె ఆరోపించారు. తన భర్త బానోత్ కిషన్ పై అక్రమ కేసు పెట్టి జైల్ కు పంపారని చంద్రుతండా సర్పంచ్ బానోత్ సంతోష్ ఆవేదన వ్యక్తం చేశారు. టేకులపల్లి మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరులతో ఆమె మంగళవారం మాట్లాడాతూ టేకులపల్లి మండలంలోని చంద్రుతండా పంచాయతీ తను ఇండిపెండెంట్గా గెలిచానని కుట్రతో పంచాయతీలో అడుగడుగునా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. చంద్రుతండా పంచాయతీకి చెందిన బానోత్ (కొట్టు) కిషన్ అనే వ్యక్తి ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో తన భర్తను ఆదివారం తీసుకెళ్ళి సోమవారం సాయంత్రం రిమాండ్ తరలించారని అన్నారు. కొట్టు కిషన్ అనే వ్యక్తి ఇంట్లోకి తన భర్త వెళ్ళి గన్ తో నేను నక్సలైట్ అని డబ్బులు డిమాండ్ చేసి బెందిరించాడని, అక్రమ కేసు పెట్టారన్నారు. తన భర్తలను అదుపులోని తీసుకున్న విషయం కానీ, రిమాండ్ తరలిస్తున్నట్లు పోలీసులు చెప్పలేదని, ఎఫ్ఐఆర్ కాఫీ ఇవ్వమన్నా..కోర్టులో చూసుకోండి అని చెప్పి టేకులపల్లి పోలీసులు సర్పంచ్ అనే గౌరవం కూడా ఇవ్వలేదని అన్నారు. రెండు రోజులు పోలిస్ స్టేషన్లో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రుతండా గ్రామ పంచాయతీలోని కొందరు భూక్య రాజా, గుగులోత్, మాన్ కిషన్, రాంజీ, రూప్ల, గన్న, మంగీలాల్, కలిసి తమపై అక్రమకేసులు పెట్టిస్తున్నారని, అనేక ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆరోపించారు. తన భర్త పంచాయతీలో నలుగురికి సహాయం చేయాలని ఆలోచన ఉన్నవాడని, అందుకే ప్రజలంరూ తమని గెలిపించారని అన్నారు. గ్రామ పంచాయతీలో ఏ కార్యక్రమాలు చేసిన తమని పంచాయతీలో కొందరు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



# అసలేం జరిగింది..? అలా ఎందుకు చేశారు..?

- అవగాహన కార్యక్రమం మధ్య ఘటన..
- డివైడర్ దాటి పరిగెత్తిన కానిస్టేబుల్..
- కారు ఢీ తర్వాత ఉద్రిక్త పరిస్థితి..
- పోలీసుల వ్యవహారంపై ప్రశ్నలు..?

**సోమవారం మధ్యాహ్నం సుజాతనగర్ వేపలగడ్డ జియో పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన ఒక ఘటన ఇప్పుడు స్థానికంగా పెద్ద చర్చకు దారి తీసింది. చిన్న ప్రమాదంగా మొదలైన ఈ సంఘటన, తర్వాత జరిగిన పరిణామాల వల్ల వివాదంగా మారింది. దీంతో అసలు అక్కడ ఏం జరిగింది? పోలీసులు ఎందుకు అలా ప్రవర్తించారు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.**

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### ››› ఏం జరిగిందంటే..

ఆ రోజు మధ్యాహ్నం ఖమ్మం – కొత్తగూడెం ప్రధాన రహదారిపై సుజాతనగర్ పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కొందరు వాహనదారులను అక్కడ పక్కకు నిలిపివేశారు. అయితే రోడ్డుపై దూరంలో ఉన్న పోలీసులను గమనించిన ఒక టు వీలర్ రైడర్ తనను ఆపుతారేమోనని అవతల పక్క ఉన్న జీవో బంకు నుండి రాంగ్ రూట్ లో వెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే ఆ రహదారి మధ్యలో డివైడర్ ఉండగా, ఒకవైపు కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు, మరోవైపు ఖమ్మం నుంచి కొత్తగూడెం వచ్చే వాహనాలు ప్రయాణిస్తున్నాయి. అయితే కొత్తగూడెం వైపు వెళ్లే దారిలో ఉన్న మహిళ ఎస్సై అది గమనించి పక్కనే ఉన్న సిబ్బందికి అతడిని అడ్డుకోవాలని సూచించింది. అదే సమయంలో ఓ కానిస్టేబుల్ మేడం ఆదేశాలను ఎలాగైనా పాటించాలని ఒక్కసారిగా డివైడర్ దాటి కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్లే లేన్‌లోకి పరిగెత్తినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఆ క్షణంలో అటు నుంచి వస్తున్న ఓ కారు డ్రైవర్‌కు పరిస్థితి స్పష్టంగా కనిపించకపోవడంతో కానిస్టేబుల్‌ను స్వల్పంగా ఢీకొట్టినట్లు సమాచారం. అయితే ఈ యాక్సిడెంట్ లో గాయాలు పెద్దవి కాకపోయినా అక్కడ పరిస్థితి మాత్రం ఒక్కసారిగా ఉద్రిక్తమైంది.

### ››› ఇలా ఎందుకు చేశారో..

ఇక్కడివరకు ఇది ఒక సాధారణ ట్రాఫిక్ ప్రమాదంలానే కనిపిస్తుంది. కానీ అసలు వివాదం తర్వాత జరిగిన వ్యవహారంపైనే. అయితే కానిస్టేబుల్ కి కారు తగిలిన వెంటనే వాహనదారుడు కారును పక్కన పెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. అంతలోనే రోడ్డుకి అవతల వైపు ఉన్న పోలీస్ సిబ్బంది ఒక్కసారిగా హుటాహుటిన





వచి ఆ వాహనాన్ని చుట్టుముట్టారు. అక్కడున్న వారి వాదన ప్రకారం, డ్రైవర్ సీట్ లో ఉన్న యువకుడిని గల్లా పట్టుకుని కారులో నుంచి బయటికి లాగినట్లు చెబుతున్నారు. అతని చేతిని బిగించి వదలకుండా పట్టుకున్నారని, ఒక నేరస్థుడిలా చిత్రీకరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కారులో అతని తల్లి సహా కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ.. అక్కడున్న మహిళ ఎస్సై పరిస్థితి సర్దుబాటు దిశగా కాకుండా మరింత కఠినంగా మారేలా వ్యవహరించారని అక్కడున్న ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఒక్కసారిగా ఆవేశంతో ఊగిపోతూ "అరేయ్ ఎవడ్రా నువ్వు.. కానిస్టేబుల్ ని గుద్ది నాటకాలు ఆడుతున్నావు" అని బిగ్గరగా అరుస్తూ.. దురుసుగా ప్రవర్తించినట్టు చెబుతున్నారు. ప్రధానంగా సాధారణ దుస్తులలో ఉన్న ఇద్దరు కానిస్టేబుల్స్ నోటికి వచ్చిన మాటలతో విరుచుకుపడుతూ చెలరేగిపోయారని ఆ సంఘటన చూసిన చోధకులు తెలుపుతున్నారు. అతని వద్ద నుండి ఫోన్ కూడా లాక్కున్నారని.. ఆ యువకుడు “మా నాన్నకు ఫోన్ చేసుకుంటా” అని పలుమార్లు అడిగినా ఫోన్ ఇవ్వలేదని సమాచారం. అయితే వాస్తవానికి ప్రమాదం జరిగిన వెంటనే ఎవరైనా కొన్ని సెకన్లు అయోమయంలో ఉంటారు. ఏం జరిగిందో అర్థం చేసుకునే సమయం అవసరం ఉంటుంది. అయితే ఆ సమయంకూడా ఆ యువకుడికి ఇవ్వకుండా.. అన్ని అవగాహన ఉన్న పోలీస్ సిబ్బంది, అధికారులే గట్టిగా ప్రశ్నించి భయభ్రాంతులకు గురి చేశారని అక్కడున్నవారు చెబుతున్నారు. ఆ తర్వాత కారును పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తోంది. అయితే గాయపడిన కానిస్టేబుల్ కు చికిత్స ఖర్చులు ఆ యువకుడే భరించాలని హుకుం కూడా జారీ చేసినట్టు తెలుస్తుంది. ప్రస్తుతం గాయపడిన కానిస్టేబుల్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే అతనికి ఎలాంటి బలమైన గాయాలు తగలలేదు అని తెలుస్తోంది.

### ››› స్పష్టమైన వివరణకు డిమాండ్..

అయితే ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం పోలీసుల బాధ్యతే. కానీ ఆ చర్యల అమలులో జాగ్రత్తలు, రహదారి భద్రత, సంఘటనలో ఉన్నవారితో వ్యవహరించే తీరు కూడా అంతే ముఖ్యమన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా కానిస్టేబుల్ అధికారి ఆదేశాల మేరకు డివైడర్ దాటి హఠాత్తుగా రహదారిలోకి వెళ్లడం సరికాదన్న వాదన కూడా వినిపిస్తోంది. ఈ ఘటనపై పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది. అయితే “అసలేం జరిగింది..? అలా ఎందుకు చేశారు..?” అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం రావాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం ఈ సంఘటన సుజాతనగర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది విధి నిర్వహణ తీరు పై పెద్ద చర్చగా మారింది.